
ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఉద్యోగిని


పోలింగ్ సామగ్రిని తనిఖీ చేసుకుంటున్న అధికారులు, ఉద్యోగులు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కొత్తపట్నం: నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 12 గంటలకే వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద బారికేడ్స్, టెంట్లు ఏర్పాటు చేశారు. వచ్చిన వారికి తాగునీరు, బాత్‌రూములు సిద్ధం చేశారు. కొత్తపట్నం మండలంలో 53 బూత్‌లలో 42,475 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు అయిన పాదర్తి, కొత్తపట్నం, కె.పల్లెపాలెం గ్రామాల్లో ప్రత్యేక బలగాలను నియమించారు. పోలింగ్ బూత్‌లలో మహిళలకు ఒక క్యూ, పురుషులు, వికలాంగులకు వేరు వేరు క్యూలు ఏర్పాటు చేశారు. 100 మీటర్లకు ఒక మార్కింగ్, 200 మీటర్లకు మరొక మార్కింగ్ వేశారు. మార్కింగ్ అవతల వైపు ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇద్దరు, ముగ్గురు ఒకేచోట ఉండకూడదని 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉందని ఓటర్లకు అవగాహన కల్పించారు. మండలంలో 7 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశారు. ఓటర్లు ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తహసీల్దార్ హేమంత్ కుమార్, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, ఎస్సై బి.సాంబశివరావు అన్ని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కొన్ని చోట్ల మహిళలకు సపరేట్‌గా బారికేడ్‌లు కట్టకపోతే.. తహసీల్దార్ దగ్గరుండి కట్టించారు. కార్యక్రమంలో సెక్టార్ ఆఫీసర్లు తులసీకుమారి, ఏఓ మోహన్ రావు, పద్మావతి, పీవోలు పాల్గొన్నారు.


ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఉద్యోగిని


కొత్తపట్నం: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్సై సాంబశివరావు


పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు


ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఉద్యోగులు


పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రానికి భారీగా చేరుకున్న అధికారులు, ఉద్యోగులు


పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను సిద్ధం చేస్తున్న ఉద్యోగి

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు


వెల్లంపల్లిలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో 20 కుటుంబాలు చేరాయి. వారికి మంత్రి మేరుగు నాగార్జున వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో పేదలకు ఎటువంటి మేలు జరగలేదని, అందువల్ల తాము ఎన్నికల ముందురోజు మాట్లాడుకుని వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు ఆకర్షితులమైనట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో రావిపాటి అంజయ్య, బొమ్మల కోటి, ముచ్చు శ్రీమన్నారాయణ, ముచ్చు హనుమంతు, సురేష్ వాసు, వెంకయ్య, నాగరాజు, నారాయణ, ఆపట్ల హనుమంతరావు తదితరుల కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐదు లారీల బియ్యం పట్టివేత

మద్దిపాడు: ఐదు లారీల బియ్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) సభ్యులు పట్టుకున్నారు. శనివారం సాయంత్రం ఒంగోలు వెంకటేశ్వరకాలనీ వద్ద ఎఫ్ఎస్‌టీ సభ్యులు తనిఖీ చేస్తుండగా రెండు లారీల్లో బియ్యం తరలివెళ్తున్నట్లు గుర్తించారు. ఆయా లారీల డ్రైవర్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని రైస్ మిల్ నుంచి తీసుకెళ్తున్నట్లు తెలపగా, గుండ్లాపల్లి చేరుకుని స్థానికంగా ఉన్న ఎఫ్ఎస్‌టీ 3తో కలిసి తనిఖీలు చేశారు. అక్కడున్న మూడు లారీల బియ్యాన్ని కూడా సీజ్ చేసి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి అప్పగించారు. రైస్ మిల్లును సీజ్ చేసి డీఎస్‌ఓ ఉదయభాస్కర్ సూచనల మేరకు మొత్తం ఐదు బియ్యం లారీలను మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది.

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి వేడుకలు


జగద్గురు శంకరాచార్యుల పూజలో పాల్గొన్న అర్చకులు, వేద పురోహితులు


శంకర జయంతి సందర్భంగా బ్రాహ్మణులకు వస్త్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: వైశాఖమాసం పంచమి ఆదివారం జగద్గురువు ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను ఒంగోలు నగరంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల శంకరమఠంలో ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు శంకరాచార్యుల మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న ఆదిశంకరాచార్యులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రీ సేవా సమితి, సనాతన ధర్మ భారతి, ఓపెన్ బ్రైన్స్ ఆధ్వర్యంలో శంకర జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని గొడుగుపాలెం రామాలయంలో మహంకాళి మురళీకృష్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా స్వామివారి పూజ నిర్వహించారు. అనంతరం మల్లవరపు రామారావు, మహంకాళి కొండయ్య శాస్త్రి, పాలుట్ల కోటయ్య, మతంపల్లి చంద్రశేఖర్, మాదిరాజు వెంకట కృష్ణయ్య, ఉప్పలపాటి మురళి, డాక్టర్ లంకా ప్రసన్న కుమార్, అన్నంబొట్ల సాయికృష్ణ, మహంకాళి నిరంజన్ పాల్గొని బ్రాహ్మణులకు వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణులు పాల్గొన్నారు.

లాయరుపేటలోని హరేరామ నివాసంలో...

ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ ఆధ్వర్యంలో లాయరుపేటలోని హరేరామ నివాసంలో నిర్వహించిన జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలలో ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు శ్రీనివాసులు, నేమ్మాని సీతారామ మూర్తి, చిలకపాటి రంగారావు పాల్గొని మాట్లాడారు. ముందుగా జగద్గురులు ఆదిశంకరుల చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, సురపరాజు రాము శర్మ, శివరాజు పుల్లయ్య, పొత్తూరు బదరి, ములుగు గంగాధర్, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ పరాంకుశం నరసింహాచార్యులు, మైనంపాటి హరినారాయణ, గడియారం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో నేడు జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటరైన ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణానికి ఉదయం 10 గంటల నుంచే సిబ్బంది చేరుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వివరాలు చూసుకొని సామగ్రిని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ద్వారా అందుకున్నారు. మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సిబ్బందితో పాటు పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ రాహుల్‌మీనా, డీఎస్పీ బాల సుందరరావు మాట్లాడుతూ సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఎన్నికలు సజావుగా జరిపించాలని సూచించారు. గొడవలు, అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్స్, వాటర్ బాటిల్స్ అనుమతించమన్నారు. పోలింగ్ సిబ్బందికి ఓటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

కొనకనమిట్లలో మొత్తం 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 38,072 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మార్కాపురం రూరల్‌లో 41,207 మంది, మార్కాపురం టౌన్‌లో 55,305 మంది, తర్లుపాడులో 25,936 మంది, పొదిలి రూరల్‌లో 22,283 మంది, పొదిలి నగర పంచాయితీలో 29,267 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కు సాయుధ పోలీసులను నియమించారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లారు.


ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

ఓటేసేందుకు..
పట్నం నుంచి పల్లెలకు..!

కొనకనమిట్ల: నేడు సార్వత్రిక ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. తమ అభిమాన నాయకుడికి ఓటేసేందుకు ఓటర్లు పట్నం నుంచి పల్లెలకు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. పలువురు అయితే ముందుగానే గ్రామాలకు చేరుకోగా కొందరు ఆదివారం చేరుకున్నారు. బస్సుల్లో ఖాళీ లేక కొంత మంది ట్రావెల్ బస్సులు, కార్లు, ఆటోల్లో వస్తున్నారు. ఆదివారం ఏ రహదారి చూసిన వాహనాలతో రద్దీ కనిపించింది. ఒంగోలు–గిద్దలూరు రహదారిలో అధిక సంఖ్యలో ఓటర్లు కార్లలో వెళ్తూ కనిపించారు. ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు గ్రామాలకు చేరుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది.


ఒంగోలు-గిద్దలూరు రహదారిపై గొట్లగట్టు వద్ద ఇలా..

● మార్కాపురంలో కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యటన

నేటి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మార్కాపురం: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మార్కాపురంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి అందజేసే ఈవీఎంలు, ఇతర సామగ్రిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ చెక్ లిస్టుల ప్రకారం సామగ్రి పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆధారాలు చూపకుండా అనారోగ్యం, ఇతర సాకులతో ఎన్నికల విధులకు హాజరుకాని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో వెళ్లే సిబ్బందికి అన్నీ వసతులు కల్పించామన్నారు. ఏ అవసరం వచ్చినా బీఎల్‌ఓలు, సెక్టారు ఆఫీసర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నియోజకవర్గంలో మొత్తం 257 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 2,14,608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 68 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు సంబంధించి 48 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 140 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 3 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. సాయుధ పోలీసు బందోబస్తుతో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మార్కాపురం ఆర్‌ఓ రాహుల్ మీనా, డీవైఎస్పీ బాల సుందరరావు సూచించారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనని ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించి పీఓలు, ఏపీఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవీఎంలు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని అనుసరించి వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ ఎటువంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రశాంతంగా ముగిసేలా అన్ని విధాలా ప్రయత్నించాలన్నారు. ఈసీ ఆదేశాలను సారంగా ప్రతి ఒక్కరూ విధులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈవీఎంను తీసుకెళ్తున్న ప్రతి ఒక్క అధికారి ఎంతో జాగ్రత్తగా వాటిని చూసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చడం వరకు మీరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆర్వో డి.నాగజ్యోతి, అసిస్టెంట్ ఆర్వోలు సిద్ధార్థ్, వి.శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఆర్‌ఓ రాహుల్ మీనా